సాక్షి వైఎస్సార్ జిల్లా

శనివారం । 15 । జూలై । 2023



స్మగ్లర్లకు 'రెడ్'సిగ్నల్

ఎర్రచందనం స్మగ్లర్ల ఆట కట్టించేందుకు అటవీశాఖ, పోలీసుశాఖలు సంయుక్తంగా ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్‌గా ఏర్పడి తిరుపతి కేంద్రంగా పనిచేస్తున్నారు. -8లో..



నిద్రలోనే గొంతు కోశారు..

ప్రొద్దుటూరు మండలంలో దారుణ హత్య జరిగింది. నిద్రపోతున్న నాగేంద్రబాబు (30) అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు గొంతుకోసి హత్య చేశారు. -8లో..

గరిష్ఠం/కనిష్ఠం
36.4/24.9

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 24.9 - 36.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 12.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

యు-విన్ పోర్టల్‌లో వ్యాధి నిరోధక టీకాల వివరాలు

కడప రూరల్: గర్భిణీ స్త్రీలు శిశువులకు వేసే వ్యాధి నిరోధక టీకాల విధానాన్నియు-విన్ పోర్టల్ ద్వారా అమలు చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం ఇక్కడ వైద్య సిబ్బందికి దీనిపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఈ విధానం ద్వారా దేశంలో ఎక్కడైనా వ్యాక్సిన్ వేసుకోవడానికి వీలుకలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్, మధుకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి రైతు బజారులో బియ్యం విక్రయాలు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో పెరుగుతున్న బియ్యం ధరలను దృష్టిలో ఉంచుకుని తక్కువ ధరకు ప్రజలకు అందించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి కడప రైతు బజారులో ఒక ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుచేసి నాణ్యమైన బియ్యం కిలో రూ. 48తోపాటు కందిపప్పు విక్రయిస్తామని తెలిపారు. ఈ కౌంటర్ జిల్లా రైస్ మిల్లర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ ఆదార్‌కార్డు తప్పనిసరిగా తీసుకు రావాలన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో కూడా బియ్యం విక్రయ కేంద్రాలు ప్రారంభిస్తున్నామన్నారు.

ప్రాసెసింగ్‌తోనే రైతులకు సరైన ప్రతిఫలం



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి మైకేల్ రాజీవ్

మైదుకూరు : పంట ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసినప్పుడే రైతులకు సరైన ప్రతిఫలం దక్కుతుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైకేల్ రాజీవ్ అన్నారు. మైదుకూరు మండలం వనిపెంటలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం కేవీకే, ఆంధ్ర ప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మైకేల్ రాజీవ్ మాట్లాడతూ ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల పథకం రైతులకు, యువకులకు మంచి అవకాశం అని పేర్కొన్నారు. కేవీకే అధిపతి శ్రీవిద్య రాణి, శాస్త్రవేత్త కాంతిశ్రీ, శాస్త్రవేత్తలు ఫిరోజ్ హుస్సేన్, హర్షిత, లావణ్య పాల్గొన్నారు.

• నర్సరీ యజమానులు నర్సరీల చట్టంలోని నియమ నిబంధనలు పాటించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మైకేల్ రాజీవ్ అన్నారు. నంద్యాలంపేట ఆర్బీకేలో శుక్రవారం నర్సరీ యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మైదుకూరు ఉద్యాన అధికారి రామకృష్ణ, ఉద్యాన సహాయకులు వెంకట సుబ్బయ్య, మధుసూదన్ రెడ్డి, గంగాదేవి పాల్గొన్నారు.

ఐఐఎస్ఎంఐబీ అధికారిగా ధర్మానాయక్ ఎంపిక

రాయచోటి: ఇటీవల యూపీఎస్సీ ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ మినిస్ట్రీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్ కాస్టింగ్‌లో సీనియర్ గ్రేడ్ గేజిటెడ్ ఆఫీసర్ పోస్టుకు సంబంధించి విడుదల చేసిన ఫలితాలలో అన్నమయ్య జిల్లా ఐఅండ్‌పీఆర్ఓ బుక్కె ధర్మానాయక్ ఎంపికయ్యారు. ఈయన సుండుపల్లె మండలం, వైఎస్ పాళెం కుప్పగుట్టపల్లెకు చెందిన వారు. యూపీఎస్సీ ద్వారా 34 ఉద్యోగాలకు సంబంధించి దేశవ్యాప్తంగా 267 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. అందులో ఎస్టీ కేటగిరికి సంబంధించి ధర్మానాయక్ ఎంపికయ్యారు.

డీసీసీ బ్యాంకు జీఎంగా రాజామణి



డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ చేతుల మీదుగా పదోన్నతి ఉత్తర్వులు అందుకుంటున్న రాజామణి

కడప అగ్రికల్చర్: కడప డీసీసీ బ్యాంకు డీజీఎంగా పనిచేస్తున్న రాజామణికి జనరల్ మేనేజర్(జీఎం)గా పదోన్నతి లభించింది. ఈమెతోపాటు మరో ఇద్దరు చీఫ్ మేనేజర్లు ఏజీఎంలుగా పదోన్నతి పొందారు. శుక్రవారం కడపలో ఆప్కాబ్, డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, ప్రావిజినల్ డైరెక్టర్ వీరారెడ్డి, ఆప్కాబ్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజయ్య, జనరల్ మేనేజర్ వెంకటరత్నం, కడప బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్‌లు ఇంటర్వ్యూలను నిర్వహించి అర్హతలను బట్టి పదోన్నతులను కల్పించారు. ఇందులో రాజామణికి జనరల్ మేనేజర్‌గా, వీరబ్రహ్మం, రాజేంద్రకుమార్‌రెడ్డిలకు ఏజీఎంలుగా పదోన్నతులను కల్పించారు. పదోన్నతుల ఉత్తర్వులను డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఝాన్సీరాణి చేతుల మీదుగా అందుకున్నారు.

నైపుణ్యం.. ప్రగతికి సోపానం

- పలు రంగాలలో యువతకు నైపుణ్య శిక్షణ
- జిల్లాలో రెండు స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలలు
- నేడు ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవం



ఊపిరి ఆగిన సమయంలో ఎలా స్పందించాలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కడప కోటిరెడ్డిసర్కిల్: యువతలో అనంతశక్తి దాగి ఉంటుంది. వారికి సరైన మార్గదర్శనం లభిస్తే బంగారు భవిష్యత్తును నిర్మించుకుంటారు. ఇదే ఉద్దేశంతో ప్రభుత్వం పలు రంగాల్లో నైపుణ్య శిక్షణకు శ్రీకారం చుట్టింది. దీంతో యువతీ యువకులు తమకు నచ్చిన రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుని రాణిస్తున్నారు. నేడు ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవ సందర్భంగా కథనం.

వైఎస్సార్ జిల్లాలో సుమారు 30-35 లక్షల జనాభా ఉంటుంది. అందులో 7-8 లక్షల మందికి పైగా యువత ఉండడం విశేషం. ఏటా పదోతరగతి, ఇంటర్మీడియేట్, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేసేవారు సుమారు రెండు లక్షల మంది వరకు ఉంటారు.అందులో కొందరు ఉన్నత విద్యవైపు దృష్టి సారిస్తే మరికొందరు వివిధ కారణాలతో చిన్నపాటి ఉద్యోగాలు,వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే చాలామందిలో ప్రతిభ ఉన్నప్పటికీ సరైన శిక్షణ లేక మారుతున్న కాలంతోపాటు నైపుణాభివృద్ధి చేసుకోలేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ఇలాంటి వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలుకల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలలను ఏర్పాటు చేస్తోంది.



ఉపాధే లక్ష్యంగా

కొత్తగా ఏర్పడే పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించారు. అయితే స్కిల్స్ ఉన్న వారికి మాత్రమే కంపెనీలు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇస్తుండడంతో జిల్లాలో ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ చదువులు చదివిన వారికి అందుకు అనుగుణంగా శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా వైఎస్సార్ జిల్లాలో కడప, పులివెందులలో స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలలను ఏర్పాటు చేసింది.

సీ-డ్యాప్ చెంత యువత

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన ద్వారా డీడీయూజీకేవై ద్వారా గ్రామీణ యువతపై ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామీణ పేద యువతను ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక శక్తిగా మార్చడం. రాష్ట్ర స్థాయి సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్, ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ప్రోగ్రామ్‌ను అమలు చేస్తున్నారు. 19-35 సంవత్సరాల వయస్సు గల పాఠశాల, కళాశాలల డ్రాపౌట్లపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పిస్తున్నారు. కడపలోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో వివిధకోర్సుల్లో సీ-డ్యాప్ స్కిల్ ఎడ్యుకేషన్ హెల్త్ ఎలక్ట్రానిక్ సెక్టార్ల నుండి ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ఫీల్డ్ టెక్నీషియన్, కంప్యూటింగ్ పెరిఫెరల్స్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ ట్రేడ్లలో ఉచితంగా శిక్షణలను అందిస్తోంది.

వివిధ కోర్సుల్లో శిక్షణ

ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్, రీటైల్ సేల్స్ అసోసియేట్, కమలాపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమీర్ కేర్ ఎగ్జిక్యూటివ్, పోరుమామిళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్; రీటైల్ సేల్స్ అసోసియేట్, మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, రీటైల్ సేల్స్ అసోసియేట్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

నైపుణ్య శిక్షణతో ఉద్యోగం



నేను ఇంటర్మీడియేట్ చదువుకున్నాను. చాలా ఇంటర్వ్యూలకు వెళ్లినా ఉద్యోగం రాలేదు. ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా శిక్షణ తీసుకుంటున్నా. ఒక ప్రముఖ కంపెనీకి ఎంపికై ఉద్యోగం చేస్తున్నాను. సరైన శిక్షణ లేక చాలామంది ఇంటర్వ్యూలను ఎదుర్కొలేక పోతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నాను. – ఎస్.రాజి, ఇంటర్మీడియేట్, తాడిపత్రి

కుటుంబానికి ఆసరాగా..



నేను బీటెక్ చదివాను. ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీడీయూజీకేవైలో శిక్షణ తీసుకున్నాను. నైపుణ్యాలపై మాస్టర్స్ ట్రైనర్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం ఓ కంపెనీలో ఉద్యోగం సాధించి మంచి జీతంతో నా కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాను.
– ఆర్.నాగవేణి, బీటెక్, నందికొట్కూరు, కర్నూలు జిల్లా

కమ్యూనికేషన్‌లో పట్టు సాధించా



ఇంటర్ వరకు చదివి చిన్న చిన్న పనులు చేసుకుంటున్నాను. నిహార్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నారని తెలిసి ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నాను. కంప్యూటర్ హార్డ్‌వేర్, కమ్యూనికేషన్‌లో పట్టు సాధించాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.
– బి.హరిత, ఇంటర్మీడియేట్, సుండుపల్లె, అన్నమయ్య జిల్లా

వృత్తి నైపుణ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి



నిరుద్యోగ యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలను అమలుచేస్తున్నాం. నైపుణాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ పూర్తవగానే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం.
– డి.నాగార్జున, జిల్లా నైపుణాభివృద్ధి అధికారి, కడప

కొండాపురంలో 18.8 మిల్లీమీటర్ల వర్షం

కడప అగ్రికల్చర్: జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం జిల్లాలోని కొండాపురంలో 18.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చెన్నూరులో 13.4 , ఖాజీపేటలో 10.8, ఒంటిమిట్టలో 9.8 , కడపలో 9.4 , వల్లూరులో 8.8, కమలాపురంలో 6.4, సిద్దవటంలో 4.6, సీకేదిన్నెలో 4.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

8 మందికి రీ సర్వే డీటీలుగా పదోన్నతి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా రెవెన్యూశాఖలో వివిధ చోట్ల సీనియర్ అసిస్టెంట్ హోదాలో పని చేస్తున్న ఎనిమిది మందికి రీ సర్వే తాత్కాలిక డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతులు కల్పించారు. శుక్రవారం కలెక్టర్ విజయరామరాజు ఈ మేరకు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. కడప జీఎన్ఎస్ఎస్ స్పెషల్ కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న టి.మల్లికార్జునకు బద్వేలు రీ సర్వే డీటీగా పదోన్నతి కల్పించి డిప్యుటేషన్‌పై జాయింట్ కలెక్టర్ సీసీగా నియమించారు. రాజంపేట తహసీల్దార్ కార్యాలయం ఎన్నికల విభాగంలో పనిచేస్తున్న పి.ఫణికృష్ణకు పదోన్నతి కల్పించి అన్నమయ్య జిల్లా రామాపురం రీ సర్వే డీటీగా బదిలీ చేశారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఎం.మధునాయక్‌ను రీ సర్వే డీటీగా బి.కోడూరుకు బదిలీ చేశారు. కలెక్టరేట్‌లో పనిచేస్తున్న సి.సాంబశివారెడ్డిని పదోన్నతిపై బ్రహ్మంగారిమఠానికి బదిలీ చేశారు. అయితే కలెక్టరేట్ సి-సెక్షన్‌లో3 డిప్యుటేషన్‌పై నియమించారు. కలెక్టరేట్‌లో పనిచేస్తున్న బి.రాజశేఖర్‌రెడ్డికి పోరుమామిళ్ల రీ సర్వే డీటీగా పదోన్నతి కల్పించి కలెక్టరేట్ ఇ-సెక్షన్‌లో డిప్యుటేషన్‌పై నియమించారు. ప్రొద్దుటూరు తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న సి.రామకిశోర్‌రెడ్డికి కడప రీ సర్వే డీటీగా బదిలీ చేసి కలెక్టర్ సీసీగా నియమించారు. మైదుకూరు తహసీల్దార్ కార్యాలయ ఎన్నికల విభాగంలో పనిచేస్తున్న బి.నరేంద్రనాథ్‌ను కలసపాడుకు పదోన్నతిపై బదిలీ చేశారు. పెద్దముడియంలో ఎంఆర్ఐగా పనిచేస్తున్న యు.శివమోహన్‌ను పదోన్నతిపై లింగాల మండలానికి బదిలీ చేశారు.

పెద్దదర్గాను సందర్శించుకున్న సాయిధరమ్‌తేజ్



పెద్దదర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న సాయిధరమ్ తేజ్

కడప కల్చరల్ : సినీ హీరో సాయిధరమ్ తేజ్ శుక్రవారం కడప నగరానికి వచ్చారు. ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రమైన అమీన్‌పీర్(పెద్ద)దర్గాను దర్శించుకున్నారు. దర్గా ముజావర్ ఆయనను సాదరంగా ఆహ్వానించి తొలుత ప్రధాన గురువుల మజార్ వద్ద ప్రార్థనలు చేయించారు. అనంతరం ఆ ప్రాంగణంలోని ఇతర గురువుల మజార్ల వద్ద కూడా ప్రార్థనలు నిర్వహింపజేశారు. ఫాతెహా నిర్వహించి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా దర్గా గురువుల చరిత్ర, క్షేత్ర మహిమ గురించి వివరించారు. సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ దర్గాను దర్శించుకోవడం భాగ్యంగా భావిస్తున్నామని, ఎంతో మనశ్శాంతిగా ఉందని తెలిపారు. రాజకీయాల గురించి పాత్రికేయులు ప్రస్తావించగా, తనకు అభిమానం మినహా రాజకీయాల పట్ల అవగాహన లేదని ముక్తసరిగా సమాధానమిచ్చారు. కాగా, అంతకు ముందు ఆయన శ్రీ విజయదుర్గాదేవి ఆలయాన్ని దర్శించుకున్నారు. అభిమానులు పెద్ద ఎత్తున హాజరై భారీ పూలమాలలను క్రేన్ సాయంతో అలంకరించారు.

ఒంటిమిట్ట రామయ్య సేవలో..

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో వెలసిన మూల మూర్తులను శుక్రవారం సినీ హీరో సాయి ధర్మతేజ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ రంగమండపంలో స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ప్రజలకు మెరుగైన సేవలను అందించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని ప్రజలకు పోస్టల్ సిబ్బంది మెరుగైన సేవలను అందించాలని కర్నూలు రీజియన్ పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ శేషారావు పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని పోస్టల్ ప్రధాన కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పోస్ట్‌మ్యాన్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోస్ట్‌మ్యాన్లు ఉత్తరాల బట్వాడా, డెలివరీని సకాలంలో ప్రజలకు అందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి పోస్ట్‌మ్యాన్ నెలకు ఐదు ఐపీపీబీ అకౌంట్లను చేయించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ పోస్టల్ సూపరింటెండ్ కిరణ్, అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్‌లు విజయ్ భాస్కర్, రమా శంకర్, అహ్మద్ హుస్సేన్, రెడ్డి భాష, పోస్ట్ మాస్టర్ రమాదేవి, ఐపీపీబీ మేనేజర్ విష్ణు వర్ధన్‌రెడ్డి, పీఎల్ఐ డెవలప్‌మెంట్ మేనేజర్ మునాఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కర్నూలు రీజియన్ పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ శేషారావు

అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రాధాన్యత రంగాలకు సంబంధించిన అన్ని అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. అన్ని అంశాల్లో జిల్లా ముందుంజలో నిలిచేలా అధికారులు కృషి చేయాలని చెప్పారు. గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, అంగన్వాడీ సెంటర్లు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు తదితర ప్రభుత్వ శాశ్వత భవన నిర్మాణాలపై దృష్టి సారించాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. నాడు-నేడులో భాగంగా జరుగుతున్న పనులను నిర్దేశిత లక్ష్యంలో పూర్తి చేయాలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు సక్రమంగా పని చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో జేసీ గణేష్‌కుమార్, విద్యాశాఖ, ఐసీడీఎస్, మున్సిపల్, మైనర్ ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

సెప్టెంబరు 15 నాటికి భవనాలు పూర్తి

జిల్లాలో ప్రాధాన్యత భవనాలను సెప్టెంబరు 15 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ విజయరామరాజు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రయార్టీ బిల్డింగ్‌ల పురోగతిపై పంచాయతీరాజ్ ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. వారానికి 70 చొప్పున స్టేజ్ కన్వర్షన్ జరగాలని చెప్పారు. సచివాలయాలు, ఆర్బీకేలు, డిజిటల్ లైబ్రరీలు, హెల్త్ క్లినిక్‌లను త్వరగా లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ఈ వారంలో 70 భవనాల స్టేజ్ కన్వర్షన్ పూర్తి చేయలేకపోయిన పంచాయతీరాజ్ ఇంజనీర్లపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు వారాల లక్ష్యాన్ని కలిపి వచ్చే వారానికి వంద స్టేజ్ కన్వర్షన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి, ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

గోశాల కాదది... స్వస్థతశాల

రోడ్లపై అడ్డదిడ్డంగా తిరుగుతూ ప్రమాదాలకు గురవుతున్న గోవులను సంరక్షించాలన్న యోచన గతంలో ఏ ప్రభుత్వాలకు రాలేదు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలకవర్గంలో నడుస్తున్న కడప నగరపాలక సంస్థ ఆ పని చేస్తుంటే పచ్చ పత్రిక ఓర్వలేకపోతోంది. ఇటీవల ఒక ఆవు చావు బతుకుల మధ్య ఉంటే నగరపాలక సిబ్బంది గోశాలకు తెచ్చి సపర్యలు చేశారు. కానీ ఆ గోవు మరుసటి రోజే మరణించింది. అయితే గోశాలలోనే ఆ గోవు చనిపోయినట్లు 'ఈనాడు' కట్టుకథ అల్లింది.

- రోడ్లపై తిరుగుతూ ప్రమాదాల బారిన పడుతున్న గోవులకు ఆశ్రయం కల్పిస్తున్న 'గోకులం'
- మూగజీవాలకు నకల సౌకర్యాలు సమకూర్చి సంరక్షిస్తున్న నగరపాలక సంస్థ



గోవులు ఉంటున్న షెడ్‌ను శుభ్రపరుస్తున్న దృశ్యం



గాయాలపాలైన ఆవుకు వైద్యం అందిస్తున్న సిబ్బంది

ఫ్యాక్ట్ చెక్

కడప కార్పొరేషన్: పట్టణాల్లో గోవులు రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రమాదాల బారిన పడుతుంటాయి.తినడానికి ఏమీ లేక ప్లాస్టిక్ కవర్లు, వాల్‌పోస్టర్లు తింటూ అవి జీర్ణం కాక వ్యాధుల బారిన పడుతుంటాయి. వీటికి ఆశ్రయం కల్పించి, రక్షించడానికి గో సంరక్షణ శాల నిర్మించాలనే ప్రతిపాదన ఎన్నో ఏళ్ల నుంచి ఉంది. ఇన్నేళ్ల తర్వాత కడప నగరపాలక సంస్థ గోశాల నిర్మించి గోవులను సంరక్షిస్తోంది. కడప నగరం 17వ డివిజన్‌లో పరిధిలో బుగ్గ అగ్రహారం సమీపంలో 3.50 ఎకరాల్లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'గోకులం' పేరిట దీనిని నిర్మించారు. గోవుల కోసం షెడ్, నీటి తొట్లు నిర్మించి, బోరు వేసి మోటార్లు అమర్చారు. విద్యుత్ సౌకర్యం కల్పించి, దీపాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆవుల కోసం ప్రత్యేకంగా పచ్చిగడ్డి, ఒట్టి గడ్డిని కొనుగోలు చేసి మేతగా వేస్తున్నారు. ప్రమాదాల వల్ల, అక్రమ రవాణా వల్ల గాయాలపాలైన గోవులకు ప్రత్యేకంగా వైద్యం అందిస్తున్నారు. గోవులకు రోజు మార్చి రోజు నీటితో, అనారోగ్యంగా ఉన్న ఆవులకు వేడి నీటితో స్నానం చేయిస్తున్నారు. పశువులు తాగే నీటి తొట్లను మూడు రోజులకు ఒకసారి శుభ్రపరుస్తున్నారు. ప్రస్తుతం ఈ గోకులంలో 80 అవులు ఉండగా, ముగ్గురు సభ్యులతో కూడిన ఓ కుటుంబం వాటి ఆలనా, పాలనా చూస్తోంది. నగరపాలక శానిటరీ ఇన్స్‌పెక్టర్ చెంచులక్ష్మి పర్యవేక్షిస్తున్నారు.

• జూన్ 3వ తేది ఓంశాంతి నగర్ రోడ్ నంబర్-20లో ఒక ఆవు కదల్లేని స్థితిలో, మూడు రోజులుగా మండుటెండలో తిండి లేక బక్కచిక్కి పోయి ఉందని...దాన్ని తీసుకుపోయి సంరక్షించాలని స్థానికులు నగరపాలక సంస్థ సిబ్బందికి ఫోన్ చేశారు. దీనిపై స్పందించిన సిబ్బంది ఆ గోవును గోకులానికి తీసుకెళ్లి వైద్యం అందించారు. కానీ మరుసటిరోజే అది మృత్యువాత పడింది.

• ఇటీవల అక్రమ రవాణా చేస్తున్న గోవులను పోలీసులు పట్టుకొని వాటిని గోకులానికి తరలించారు. అందులో ఒక గోవు తీవ్ర గాయాలపాలై ప్రసవానికి సిద్ధంగా ఉంది. పశువైద్య సిబ్బంది ఆ గోవుకు వైద్యం చేసి సెలైన్ బాటిల్స్ ఎక్కించి, ఎట్టకేలకు ప్రసవం అయ్యేలా చేశారు. కానీ తీవ్ర గాయాలపాలైన ఆ గోవు లేవలేని స్థితిలో ఒక వైపునే పడిపోయి ఉండటం వల్ల గాయాలు మానే పరిస్థితి కనిపించడం లేదు. అయినా దాని ప్రాణాలు కాపాడేందుకు సిబ్బంది నిరంతరం శ్రమిస్తూనే ఉన్నారు.


• ఇటీవల రిమ్స్ సమీపంలో ఓ లేగదూడ ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఆ దూడ కాలు విరిగిపోయింది. దాన్ని నగరపాలక సిబ్బంది ఆసుపత్రికి తీసుకుపోయి చికిత్స చేయించి, కాలుకు కట్టుకట్టించారు..ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే...ఈ కొన్ని మాసాల్లోనే ఇలాంటి ఉదాహరణలు చాలానే ఉన్నాయి.

గోవుల సంరక్షణకు అన్ని రకాల సౌకర్యాలు



'గోకులం'లో ఉన్న గోవుల సంరక్షణను కమిషనర్ ఆధ్వర్యంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాము. ఇటీవల రెండు ఆవులు తీవ్ర గాయాలపాలై గోశాలకు వచ్చాయి. వచ్చిన మరుసటిరోజే ఒక ఆవు చనిపోయింది. ఒక ఆవుకు వైద్యం అందిస్తున్నాం కానీ దాని ఆరోగ్యం మెరుగుపడలేదు. గోకులం ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది. – చెంచులక్ష్మి, శానిటరీ ఇన్స్‌పెక్టర్. కేఎంసీ.

రోజు మార్చి రోజు గోవులకు స్నానం



గోకులంలో ఉన్న ఆవులకు రోజు మార్చి రోజు స్నానం చేయిస్తున్నాం. ప్రతిరోజూ గోవులు ఉన్న షెడ్‌ను శుభ్రం చేస్తున్నాం. అనారోగ్యంతో ఉన్న ఆవులకు వేడినీళ్లు కాచి స్నానం చేయిస్తున్నాం. గోవులు అకస్మాత్తుగా అనారోగ్యానికి గురైతే ప్రథమ చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేశారు. మేత, తిండి, నీళ్లకు ఎలాంటి కొదువ లేదు. – వెంకట సుబ్బయ్య, సంరక్షకుడు, గోకులం.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మస్తాన్ (ఫైల్)

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని భాకరాపేట సబ్‌స్టేషన్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. రైల్వేకోడూరు పట్టణం గాంధీనగర్ వీధికి చెందిన షేక్ మస్తాన్ (52) సుమారు 12 సంవత్సరాల క్రితం బద్వేలుకు సమీపంలోని భాకరాపేటకు వచ్చి స్థిరపడ్డాడు. డ్రైవర్‌గా పనిచేస్తుండే ఇతడి భార్య ఏడాది క్రితం మృతిచెందింది. ఇద్దరు కుమార్తెలు ఉండగా ఇద్దరికీ వివాహం చేశాడు. అయితే కొన్నేళ్ళుగా మస్తాన్ మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున భాకరాపేట సబ్‌స్టేషన్ ఆవరణలోని ముళ్ళపొదల్లో మస్తాన్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి అర్బన్ పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మస్తాన్ పెద్దనాన్న కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ ఎస్‌ఐ వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా మస్తాన్ అధికంగా మద్యం సేవించడం వల్లే మృతిచెందినట్లు స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

కడపలో చోరీ

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప రిమ్స్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఎస్‌ఆర్ నగర్‌లో చోరీ జరిగింది. తాళం వేసిన ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు తొమ్మిది తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు.గతనెల 30వ తేదీన స్థానికంగా నివాసముంటున్న నిర్మల జగన్నాథ యాత్రకు వెళ్లింది. యాత్రను ముగించుకుని శుక్రవారం ఇంటికి చేరుకుంది. ఇంటి తలుపులు తెరచి ఉండడం చూసి లోపలికి వెళ్లి చూడగా లాకర్‌లో ఉంచిన బంగారు గాజులు, ఉంగరాలు, కమ్మలు, చిన్న చైను కలిపి మొత్తం తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించింది. బాధితురాలు రిమ్స్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ నారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్మగ్లర్లకు రెడ్‌సిగ్నల్

- నాలుగేళ్లలో 202 ఎర్రచందనం అక్రమ రవాణా కేసులు
- ఒకటికి రెండుసార్లు పట్టుబడితే పీడీ యాక్ట్
- 1279 మంది నిందితుల అరెస్ట్, 3135 ఎర్రచందనం దుంగలు సీజ్
- ఫలితమిస్తున్న అటవీశాఖ, పోలీసుల కార్యాచరణ


ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ విభాగంవారితో కలిసి పరిశీలిస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ (ఫైల్)


నిందితుడు ఇరగంరెడ్డి నాగదస్తగిరి రెడ్డి (ఫైల్)


నిందితుడు సింపతి జాకీర్ (ఫైల్)

కడప డెస్క్ : ప్రపంచంలోనే ఎక్కడా పెరగని అరుదైన వృక్షం ఎర్రచందనం. కేవలం రాయలసీమ జిల్లాల్లో మాత్రమే ఈ వృక్షాలు పెరుగుతాయి. ఎన్నో ఉపయోగాలు కలిగిన ఎర్రచందనం ఎక్కడా దొరకదు కాబట్టి దానికి ప్రపంచ మార్కెట్‌లో ఎనలేని గిరాకీ ఉంది. అందుకే స్మగ్లరు అడవులను ఇష్టానుసారంగా నరికి ఎర్రచందనాన్ని జిల్లాలు, రాష్ట్రాలు, చివరికి దేశం నుంచి కూడా దాటించి సొమ్ము చేసుకుంటున్నారు.అటవీ ప్రాంతంలో కూలీల స్థాయి నుంచి మేస్త్రీలు, జిల్లా స్థాయి స్మగ్లర్ల మొదలు అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ స్మగ్లర్ల వరకు వివిధ కేటగిరీల్లో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఎర్రచందనం తరలిపోకుండా పోలీసులు, అటవీశాఖ అధికారులు కఠిన చర్యలు చేపడుతున్నారు.

బృందాలుగా కార్యాచరణ

ఎర్రచందనాన్ని అక్రమంగా తరలిస్తున్న స్మగ్లర్ల ఆట కట్టించేందుకు అటవీశాఖ, పోలీసుశాఖలు సంయుక్తంగా ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్‌గా ఏర్పడి తిరుపతి కేంద్రంగా పనిచేస్తున్నారు. దీనిని డీఐజీ స్థాయి అధికారి పర్యవేక్షిస్తున్నారు. వారితో పాటు ఎస్పీ, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, అటవీశాఖ సిబ్బందితో కలిసి బృందంగా ఏర్పాటు చేశారు. ఈ బృందం నిత్యం అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహిస్తూ ఎర్రచందనం అక్రమంగా తరలిపోకుండా చూస్తోంది. మరోవైపు రాయలసీమలోని ఆయా జిల్లాల ఎస్పీల నేతృత్వంలో ఆర్‌ఎస్‌టీఎఫ్ (రెడ్ శాండిల్ టాస్క్‌ఫోర్స్) బృందం ఏర్పాటై ఎర్రచందనం అక్రమ రవాణా నేరాల నియంత్రణకు కృషి చేస్తోంది. ఈ విభాగాన్ని నేరుగా ఓఎస్‌డీ లేదా అదనపు ఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేయబడిన అటవీ, పోలీసు శాఖల చెక్‌పోస్టులలో 24/7 నిఘాతో సీసీ కెమెరాలతో పాటు, సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వహిస్తున్నారు.

వైఎస్‌ఆర్ జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందంలో ప్రధానంగా జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ నేతృత్వంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీతో పాటు ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబు, ఇన్‌స్పెక్టర్ బి.నాగభూషణ్ తదితర సిబ్బంది పనిచేస్తున్నారు.

జిల్లాలో గత ఏడాదిగా పోలీసులు నిర్వహించిన విస్తృతదాడుల్లో పలువురు ఎర్రచందనం స్మగ్లర్లు పట్టుబడ్డారు. కొన్ని ఉదాహరణలు..

- 2022 సెప్టెంబర్, 8న తెల్లవారుజామున 5:30 గంటల సమయంలో ఒంటిమిట్ట మండలంలోని నర్వకాటపల్లె సమీపంలోని అటవీప్రాంతంలో అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన సుమారు టన్ను బరువున్న 49 ఎర్రచందనం దుంగలను సీజ్ చేశారు. వీటితో పాటు రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, ఏడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలో నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం ఏఎస్ పేటకు చెందిన మహమ్మద్‌బాషతో పాటు మొత్తం 9 మంది అంతర్ జిల్లా ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేశారు.
- గత ఏడాది అక్టోబర్ 25న జిల్లాలోని కాశినాయన మండలం సావిశెట్టిపల్లె గ్రామం పడమర దిక్కున నల్లమల అటవీప్రాంతంలో జింకపిల్ల గొంది వద్ద దాచి వుంచిన టన్ను బరువున్న 57 ఎర్రచందనం దుంగలను, కారు, రెండు మోటార్ సైకిళ్లను, ఐదు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలో జిల్లాలోని కలసపాడు మండలం మహానందిపల్లెకు చెందిన నగిలి భాస్కర్‌తో పాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు.
- గత ఏడాది నవంబర్ 27న జిల్లాలోని లంకమల్ల అటవీప్రాంతంలో బ్రహ్మంగారి మఠం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎర్రచందనం స్మగ్లర్లపై పోలీసులు దాడులు నిర్వహించారు. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా మరక్కనూర్ గ్రామానికి చెందిన వెల్లియాన్ దశరథతో పాటు, మరో 15 మంది ఎర్రచందనం స్మగ్లర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి టన్ను బరువున్న 49 ఎర్రచందనం దుంగలను, లారీ, రెండు కార్లు, 8 సెల్‌ఫోన్‌లతో పాటు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.
- ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న జిల్లాకు చెందిన అంతర్ రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్లపై పీడీ యాక్ట్‌ను ప్రయోగించారు. వీరిలో జిల్లాకు చెందిన ఇద్దరు ప్రధాన ఎర్రచందనం స్మగ్లర్లపై పీడీ యాక్ట్‌ను ప్రయోగించారు. వీరిలో ప్రధానంగా జిల్లాలోని చాపాడు మండలం ఖాదర్‌పల్లెకు చెందిన షేక్ సింపతి జాకీర్ అలియాస్ చింపతి జాకీర్ (27), ప్రొద్దుటూరు టౌన్ అమృతనగర్‌లో నివాసం వుంటున్న ఇరగంరెడ్డి నాగదస్తగిరి రెడ్డి (34) వున్నారు. 2014 నుంచి ఇప్పటివరకు జాకీర్‌పై 84 కేసులు, నాగదస్తగిరి రెడ్డిపై 87 కేసులు నమోదయ్యాయి.
- జిల్లాలో 2019 నుంచి ఇప్పటివరకు 202 కేసులను నమోదు చేశారు. వాటి ద్వారా మొత్తం 1279 నిందితులను అరెస్ట్ చేశారు. 3135 ఎర్రచందనం దుంగలను (వీటి బరువు సుమారు 75.497 టన్నులు), 203 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.
- 2020 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 32 మందిపై పీడీ యాక్ట్‌లను ప్రయోగించారు. 2020లో రెండు, 2021లో 16, 2022లో ఏడు, 2023లో ఇప్పటివరకు ఏడుగురిపై పీడీ యాక్ట్‌లను ప్రయోగించారు.

జిల్లాలో నమోదైన కేసుల వివరాలు

సంవత్సరం	కేసుల సంఖ్య	అరెస్టయిన నిందితులు	దుంగలు (బరువు కిలోల్లో)	వాహనాలు
2019	48	223	887 - 21259	43
2020	53	269	647 - 14917	44
2021	61	543	817 - 21852.15	59
2022	32	151	651 - 14301.6	41
2023 జూన్ వరకు	08	93	133 - 3167	16
మొత్తం	202	1279	3135 - 75497	203

ఎంతటివారినైనా వదలం

జిల్లాలో ఎవరైనా ఎర్రచందనం వృక్షాలను నరికినా, అమ్మినా, కొన్నా, దాచి వుంచినా, అక్రమంగా రవాణా చేసినా, అందుకు ఏవిధంగా సహకరించినా అలాంటి వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. నిందితులపై హిస్టరీషీట్లను తెరుస్తున్నాం. పదేపదే ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై పీడీ యాక్ట్‌లు ప్రయోగించి అమలు పరుస్తాం. ఎర్రచందనం తరలింపు సమాచారం తెలిసిన వెంటనే మాకు అందజేయయండి. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.
– జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

10 మంది జూదరుల అరెస్టు

చక్రాయపేట : చక్రాయపేట మండలం గంగారపువాండ్లపల్లె సమీపంలో శుక్రవారం జూదమాడుతున్న 10 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1.04 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆర్‌కే వ్యాలీ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. తమకు అందిన సమాచారంతో పోలీసు సిబ్బందితో కలిసి దాడి చేసి జూదరులను పట్టుకున్నట్లు చెప్పారు. ఎస్‌ఐ వినోద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు నెలల చిన్నారిపై వానరం దాడి


వానరం దాడిలో తీవ్రంగా గాయపడ్డ చిన్నారి అమన్

కమలాపురం : కమలాపురం మండలం పెద్దచెప్పలికి చెందిన అబ్దుల్ అమన్ అనే ఐదు నెలల చిన్నారిపై వానరం దాడి చేసి గాయపరిచింది. గౌజ్ ఆజం కుమారుడు అమన్ (5నెలలు) ఇంట్లో ఊయలలో నిద్రిస్తుండగా ఇంట్లోకి వచ్చిన వానరం చిన్నారి బుగ్గపై కరిచింది. దీంతో చిన్నారి బుగ్గపై ఐదారు లోతైన కాట్లు పడ్డాయి. అమన్ ఏడుస్తున్నా వానరం వదల్లేదని, తాము వెంటబడి తరిమితే వెళ్లిందని అమన్ తండ్రి గౌస్ వాపోయాడు. అనంతరం అమన్‌ను తల్లిదండ్రులు కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. గ్రామంలో కోతులు ఎక్కువగా ఉన్నాయని, వాటిని పట్టి దూర ప్రాంతాల్లో వదలాలని తహసీల్దార్‌కు గతంలో తాము ఫిర్యాదు చేశామని, అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధిత తండ్రి గౌస్ చెప్పాడు.

యువకుడి ప్రాణం బలిగొన్న ఆన్‌లైన్ బెట్టింగ్

పోరుమామిళ్ల : ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటుపడిన పోరుమామిళ్ల మండలం రాజాసాహేబ్‌పేటకు చెందిన యువకుడు కల్లూరు క్రిష్టారెడ్డి (25) అప్పులపాలై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కల్లూరు గురివిరెడ్డి కుమారుడు క్రిష్టారెడ్డి హైదరాబాద్‌లో రెస్టారెంట్ నిర్వహిస్తున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగులకు బానిసగా మారి రూ.10 లక్షలు అప్పులు చేసి మొత్తం పోగొట్టాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక బుధవారం హైదరాబాద్‌లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం సొంత గ్రామంలో క్రిష్టారెడ్డి అంత్యక్రియలు జరిపారు. శుక్రవారం పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర కార్యదర్శి నాగార్జునరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

23న ప్రథమ అర్ధసంవత్సర సమావేశం

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేవుని కడప పోలీసు శాఖ ఉద్యోగుల పరస్పర సహకార గృహ నిర్మాణ సంఘం మహాజన సభ ప్రథమ అర్ధ సంవత్సరం (2023–24)కు సంబంధించి ఈనెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు వైఎస్సార్ పోలీసు కాలనీలో సమావేశం నిర్వహించాలని పాలకవర్గం తీర్మానించినట్లు ఆ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది ఇద్దరు సభ్యులను కొత్తగా ఎన్నుకోవాల్సి ఉంటుందని, అందులో భాగంగా ఈ ఏడాది సీనియర్ సభ్యులైన శివశంకర్, యోగయ్యల స్థానంలో ఎన్నికలు జరగాల్సి ఉందన్నారు. వైఎస్సార్ పోలీసు కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించడం, ఇళ్ల స్థలాలు పొందిన ప్రతి సభ్యుడు ఇల్లు నిర్మించుకోవడం తదితర అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు.

రంగనాయకులపేటలో చోరీ

రైల్వేకోడూరు : పట్టణంలోని రంగనాయకులపేటలోని మసీదు వద్ద గురువారం అర్ధరాత్రి దొంగలు ఓ ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. సుంకేసుల మస్తాన్ తన ఇంటి కింద గదిని షాపు కోసం అద్దెకిచ్చి పైనున్న గదిలో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. పిల్లల చదువుకోసం నెలక్రితం మస్తాన్ ఇంటికి తాళం వేసి తిరుపతికి వెళ్లి అక్కడే ఉంటున్నారు. గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మస్తాన్ ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న 20వేల నగదు, నాలుగు తులాల బంగారు , 400 గ్రాముల వెండిని దొంగిలించుకుని పోయారు. మస్తాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

నిద్రలోనే గొంతు కోశారు..




రక్తపు మడుగులో నాగేంద్రబాబు మృతదేహం, విషాదంలో నాగేంద్రబాబు భార్యాపిల్లలు, మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

- ప్రొద్దుటూరులోని కానపల్లెలో వ్యక్తి దారుణహత్య
- వేకువ జామున ఘాతుకానికి పాల్పడ్డ దుండగులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు మండలంలో దారుణ హత్య జరిగింది. నిద్రపోతున్న నాగేంద్రబాబు (30) అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు గొంతుకోసి దారుణంగా హత్య చేశారు. శుక్రవారం వేకువజామున మండలంలోని కానపల్లెలో ఈ దారుణ సంఘటన జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తపల్లె పంచాయతీలోని కానపల్లె ఎస్సీ కాలనీకి చెందిన ఆకుమల్ల నాగేంద్రబాబు గ్రానైట్ ఫ్లోరింగ్ పనికి వెళ్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ క్రమంలో పనికి వెళ్లిన అతడు గురువారం రాత్రి పొద్దుపోయాక ఇంటికి వచ్చాడు. మద్యం తాగిన సమయంలో అతడు ఇంట్లో కాకుండా పక్కనే ఉన్న అక్క గారింటికి వెళ్లి నిద్రించేవాడు. గురువారం రాత్రి కూడా మద్యం తాగొచ్చి పక్కనే ఉన్న మిద్దెపై నిద్రించాడు.

రక్తపు మడుగులో మృతదేహం..

తెల్లారినా భర్త కిందికి రాకపోవడంతో భార్య ఇమాంబీ నాగేంద్రను నిద్రలేపేందుకు శుక్రవారం ఉదయం మిద్దెపైకి వెళ్లింది. భర్త రక్తపు మడుగులో పడిఉండటం చూసి నిర్ఘాంతపోయింది. గట్టిగా కేకలు పెట్టడంతో బంధువులందరూ మిద్దెపైకి పరుగెత్తుకుంటూ వచ్చారు. నాగేంద్రబాబు హత్య గురైన విషయాన్ని పోలీసులకు తెలిపారు. రూరల్ ఇన్‌చార్జి సీఐ ఇబ్రహీం, ఎస్‌ఐ శివప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలంలో క్లూస్ టీం వేలి ముద్రలు సేకరించారు. పోలీసు జాగిలం సంఘటనా స్థలంతో పాటు చుట్టు పక్కల ఉన్న రెండు వీధుల్లో కలియ తిరిగింది.

ఇంటి పరిసరాల్లో రక్తపు మరకలు

నాగేంద్రబాబు హత్యకు గురైన చోటు నుంచి ఇంటి పరిసరాల్లో రక్తపు మరకలు పడి ఉన్నాయి. హత్య కోసం వాడిన కత్తి నుంచి రక్తం కింద పడినట్లు పోలీసులు నిర్ధారించారు. రక్తపు మరకలు పడిన ఆనవాళ్లను బట్టి దుండగులు వెళ్లిన మార్గాన్ని పోలీసులు గుర్తించారు. ఇంటిపైకి వెళ్లేందుకు విశాలమైన ప్రధాన ద్వారం ఉన్నా.. ఇంటి పక్కనే ఉన్న ఇరుకైన సందులో నుంచి దుండగులు మిద్దెపైకి వెళ్లినట్లు తెలుస్తోంది. స్థానికులే నాగేంద్రను హత్య చేసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. నాగేంద్ర పక్కనే అతడి అక్క కుమారుడు పడుకొని ఉన్నాడు. అతడు కూడా మద్యం సేవించి నిద్రించాడని, పైగా అతడికి చెవుడని బంధువులు తెలిపారు. హత్య జరిగే సమయంలో పెనుగులాట జరిగి ఉంటుందని.. నీకు వినిపించలేదా? అని పోలీసు అధికారులు అతన్ని ప్రశ్నించారు. తనకు వినిపించలేదని పోలీసులకు తెలిపాడు. నాగేంద్రబాబు ప్రవర్తన గురించి పోలీసు అధికారులు ఆరా తీస్తున్నారు. శుక్రవారం వేకువ జామున హత్య జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

ప్రేమ వివాహం చేసుకున్న నాగేంద్రబాబు

నాగేంద్రబాబుకు నాలుగేళ్ల క్రితం పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన ఇమాంబీతో ప్రేమ వివాహం జరిగింది. మొదట్లో వీరి పెళ్లిని ఇమాంబీ కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. కొన్ని రోజుల తర్వాత అందరూ కలిసిపోయారు. వారికి మూడు, రెండేళ్ల వయసు గల నందన, పురుషోత్తం అనే కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య ఇమాంబీ ఇంట్లోనే చిల్లర కొట్టు నిర్వహిస్తోంది. భర్త మరణంతో భార్యా పిల్లలు కన్నీరుమున్నీరయ్యారు. ఇమాంబీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.

శాకంబరి అలంకారంలో భద్రకాళి మాత



చాపాడు : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థాన సన్నిధిలో శుక్రవారం భద్రకాళి మాత శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వస్తి శ్రీ చాంద్రమానేనా శ్రీ శోభకృత్ నామ సంవత్స ఆషాఢ బహుళ ద్వాదశి సందర్భంగా శుక్రవారం ఉదయం గణపతి పూజ, భద్రకాళి అమ్మవారికి పంచామృత అభిషేకం చేశారు. అనంతరం మంగళ హారతిలో భద్రకాళిమాత శాకంబరి అలంకారంలో దర్శనమిచ్చారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు సామూహిక కుంకుమార్చన కార్యక్రమంతో వేద పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు.

ఒంటిమిట్ట రామయ్య సేవలో పత్తికొండ ఎమ్మెల్యే


ఆలయ రంగమండపంలో సన్నిహితులతో పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో వెలసిన మూలమూర్తులను శుక్రవారం పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీదేవి తన సన్నిహితులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఎమ్మెల్యేకు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం ఎమ్మెల్యే గర్భాలయంలోని మూలమూర్తులైన సీతారామలక్ష్మణ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగమండపంలో స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఎమ్మెల్యే వెంట ఆలయ టీటీడీ సూపరింటెండెంట్ వెంకటేశయ్య, టీటీడీ సిబ్బంది ఉన్నారు.

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్ల నిరసన


కలసపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

కలసపాడు : కలసపాడులో శుక్రవారం పవన్‌కల్యాణ్ వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండల ఉపాధ్యక్షుడు అన్నారెడ్డివిజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి మూడు రోడ్ల కూడలి వరకు వలంటీర్లు ర్యాలీ నిర్వహించి పవన్‌కల్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జగనన్న సచివాలయాల కన్వీనర్ చిత్తారాజశేఖర్‌రెడ్డి, మహానందిపల్లె సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు అన్నారెడ్డి వెంకటరామిరెడ్డి, పులి వీరారెడ్డి, గంగరాజు, హరిబాబు, వలంటీర్లు మల్లికార్జున, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అరవపల్లెలో..

నందలూరు(ఒంటిమిట్ట) : తమ పట్ల పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మండల పరిధిలోని అరవపల్లె వలంటీర్లు పంచాయతీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. వలంటీర్లకు పవన్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వలంటీర్లు బస్టాండ్ కూడలిలో హైవే పై మానవహారం నిర్వహించడంతో కాసేపు వాహనాలు నిలిచిపోయాయి.

రోడ్డు ప్రమాద కేసులో నిందితుడికి 6నెలల జైలు, జరిమానా

కడప కోటిరెడ్డి సర్కిల్ : రోడ్డు ప్రమాద కేసులో నిందితుడికి 6నెలల జైలు, జరిమానా విధిస్తూ ఏజేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. కడప నగరంలోని తాలూకా పోలీసుస్టేషన్ పరిధిలో 2022 జనవరిలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఖాజీపేట మండలం తుడుములదిన్నెకు చెందిన కొత్తపల్లి వెంకటసుబ్బారెడ్డి బైక్‌పై వస్తూ ఎదురుగా బైక్‌పై వస్తున్న ఆర్. వెంకటసుబ్బయ్య (42)ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వెంకటసుబ్బయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదే నెల 16వ తేదీన మృతి చెందాడు. దీంతో మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు అప్పట్లో కడప తాలూకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కొత్తపల్లి వెంకటసుబ్బారెడ్డి బైక్‌ను వేగంగా నడిపి ఓ వ్యక్తి మరణానికి కారణమయ్యాడని సాక్ష్యాలను బట్టి నిర్ధారించిన కోర్టు నిందితుడికి ఆరు నెలలపాటు జైలుశిక్ష, రూ. 17 వేలు జరిమానా విధిస్తూ ఏజేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ భార్గవి తీర్పునిచ్చారు. కేసులో శిక్ష పడేందుకు కృషి చేసిన ఏపీపీ శ్రీకాంత్‌ను కడప తాలూకా సీఐ ఉలసయ్య, కడప కోర్టు మానిటరింగ్ సెల్ నోడల్ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు, హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు, కానిస్టేబుల్ పుల్లయ్యలను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు.